ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
రంగారెడ్డి
5
జిల్లా వార్తలు
సోమవారం 8 డిసెంబరు 2025



డ్రోన్ షోకు సిద్ధమవుతున్న టెక్నీషియన్

▌ఎల్ఈడీ స్క్రీన్‌లతో సిద్ధమైన అతిథులు వెళ్లేదారి



ఫ్యూచర్ అదిరేలా..

బీఎఫ్‌సీలో గ్లోబల్ సమ్మిట్ ఏర్పాట్లు

రాష్ట్ర ప్రభుత్వం భారత్ ఫ్యూచర్ సిటీ (బీఎఫ్‌సీ)లో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. దేశ, విదేశాల నుంచి వచ్చే అతిథులకు ఆతిథ్యం అదిరేలా ఏర్పాట్లు చేశారు. సమ్మిట్ ప్రాంతంలోని రోడ్లన్నీ స్వాగత తోరణాలతో కళకళలాడుతున్నాయి. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణకు ఏర్పాటు చేసిన వేదికలను పూల మొక్కలతో ప్రత్యేకంగా తీర్చిదిద్దారు. 25శాఖల ముఖ్య అధికారులు ఏర్పాట్లను దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. నేడు(సోమవారం) మధ్యాహ్నం సమ్మిట్ అట్టహాసంగా ప్రారంభం కానుంది.



ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఆధీనంలో..

గ్లోబల్ సమ్మిట్ ప్రాంగణం ఆదివారం సాయంత్రం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నారు. ఇందులోకి పాసుల లేని వారిని అనుమతులు ఉండవని పోలీసు ఉన్నతాధికారులు తెలిపారు. సమ్మిట్ జరిగే మీర్కాన్‌పేట, బేగరకంచె గ్రామాలలో మూడంచెల భద్రతను ఏర్పాటు చేసినట్లు మహేశ్వరం డీసీపీ నారాయణరెడ్డి, ఇబ్రహీపట్నం ఏసీపీ రాజు తెలిపారు. సోమవారం, మంగళవారం రోజుల్లో కందుకూరు మండల కేంద్రం నుంచి మీర్కాన్‌పేట మీదుగా యాచారం వెళ్లే ప్రయాణికులను దారి మళ్లించినట్లు తెలిపారు. ఈ రోడ్డుపై నుంచి కాకుండా హైదరాబాద్ -శ్రీశైలం జాతీయ రహదారి రాచులూరు గేటు నుంచి రాచులూరు, గుమ్మడవెల్లి గ్రామం మీదుగా ఆకుల మైలారం, మీర్కాన్‌పేట గ్రామానికి వెళ్లాలని ప్రయాణికులకు విజ్ఞప్తి చేశారు. రెండు రోజుల పాటు తమ పోలీసులకు సహకరించాలని వారు కోరారు. ముఖ్యంగా రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల రైతులకు హెచ్ఎండీ తరహాలో ఏర్పాటు చేసిన వెంచర్‌ను పోలీసుల ఆధీనంలోకి తీసుకున్నట్లు వారు తెలిపారు.



- ప్రాంగణమంతా డిజిటల్ మయం
- స్వాగత తోరణాలతో రహదారులన్నీ కళకళ
- హాజరుకానున్న 3వేల మంది అతిథులు
- గెస్ట్‌లకు గుర్తుండేలా ప్రత్యేక వంటకాలు
- పోలీస్ పహారాలో ఆర్థిక సదస్సు ప్రాంగణం
- ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు పొంగులేటి, పొన్నం
- అట్టహాసంగా నేడు గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం

రంగారెడ్డి అర్బన్/ఇబ్రహీంపట్నం/మహేశ్వరం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): గ్లోబల్ సమ్మిట్ ప్రపంచలోనే రోల్ మోడల్‌గా నిలిచేలా ప్రభుత్వం తగిన చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లా కందుకూరు మండలం మీర్కాన్‌పేట - బేగరికంచలోని భారత్ ఫ్యూచర్‌సిటీ వేదికగా సోమవారం మధ్యాహ్నం గ్లోబల్ సమ్మిట్ ప్రారంభం కానుంది. దేశ, విదేశాల నుంచి దిగ్గజ పారిశ్రామికవేత్తలు, కేంద్రమంత్రులు, ముఖ్యమంత్రులు, సినీ, క్రీడా, ఇన్నోవేటర్లు, పాలసీ మేకర్లు, విద్యారంగాలకు చెందిన ప్రముఖులు, విదేశీ రాయబారులు, ఆయా దేశాలకు చెందిన నిష్ణాతులు ఈ సమ్మిట్‌కు హాజరుకానున్నారు. ఆదివారం రాత్రి వరకు మంత్రులతో పాటు 26 శాఖలకు చెందిన ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ.. సభా వేదికకు తుది మెరుగులు దిద్ది ఏర్పాట్లు పూర్తి చేశారు. 'తెలంగాణ రైజింగ్ థీమ్'తో ప్రపంచ

మిగతా 6వ పేజీలో...





సమ్మిట్ ప్రాంగణంలో చివరి దశలో ఏర్పాట్లు



నేటి నుంచి ఉర్సు

నేటి నుంచి షాబాద్ పహిల్వాన్‌షావలీ దర్గా ఉర్సు ప్రారంభమవుతుందని ఉత్సవ మండలి సభ్యులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 8వ తేదిన గంధం, 9న దీపారాధన, 10, 11 తేదీల్లో ఉర్సు కొనసాగుతుందని వివరించారు. ఉత్సవాలకు జిల్లాతో పాటు పక్క రాష్ట్రాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివస్తారని చెప్పారు.

షాబాద్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)

కుక్కల దాడిలో 42 మందికి గాయాలు

ఆమనగల్లులో ఘటన

» ఆసుపత్రిలో బాధితులకు చికిత్స





కుక్క దాడిలో గాయపడి చికిత్స పొందుతున్న యువకులు

ఆమనగల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలో ఆదివారం ఓ వీధి కుక్క ప్రజలను భయభ్రాంతులకు గురిచేశాయి. ద్విచక్ర వాహనదారులు, పాదచారులపై దాడికి పాల్పడింది. ప్రధాన రహదారిపై చోటు చేసుకున్న ఈ సంఘటనతో స్థానికులు భయాందోళనకు గురయ్యారు. పిచ్చి కుక్క దాడిలో సుమారు 42 మంది వరకు తీవ్రంగా గాయపడ్డారు. ఆమనగల్లులోని కల్వకుర్తి రోడ్డు మార్కెట్ యార్డ్ నుంచి హైదరాబాద్ రోడ్డు ప్రభుత్వ ఆసుపత్రి వరకు కుక్క స్వైర విహారం చేసింది. అడ్డొచ్చిన వాళ్లందరినీ తీవ్రంగా గాయపరిచింది. ద్విచక్ర వాహనాదారులను వెంబడించి గాయపరిచింది. కుక్క దాడితో హైదరాబాద్ - శ్రీశైలం జాతీయరహదారిపై పాదచారులు, బైకిస్టులు పరుగులు తీశారు. గాయపడ్డ వారు ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందారు. ప్రాథమిక చికిత్స అనంతరం నారాయణగూడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కుక్క దాడిలో గాయపడ్డ వారిలో ఆమనగల్లు, కడ్తాల్, వెల్దండ, హైదరాబాద్‌లకు చెందిన చంద్రశేఖర్, రాహుల్, భాగ్యలక్ష్మి, ప్రణీత్‌కుమార్, నాను, రామకృష్ణ, శివాంష, బాల్‌రామ్, వీరయ్య, రాధ, రమేశ్, చింటు, మురళి, అంతయ్య, సత్యనారాయణ, కృష్ణయ్య, చంద్రయ్య, రాములు, హరికుమార్, హీమ, యాదయ్య తదితరులు ఉన్నారు.

గ్రామాలను అభివృద్ధి చేసుకోవాలి

కొత్తూర్, డిసంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ బలపర్చిన సర్పంచ్ అభ్యర్థులు సేవకులై పని చేస్తారని, వారిని ఆశీర్వదించి గ్రామాలను మరింత అభివృద్ధి చేసుకోవాలని షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. మండల పరిధిలోని తీగాపూర్, మల్లాపూర్, గుడూరు గ్రామాల్లో ఎమ్మెల్యే సుడిగాలి పర్యటన చేశారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్ అభ్యర్థులు గొంగళ్ల హరినాథ్‌రెడ్డి, చిన్నారెడ్డి, ఉప్పల దయానంద్, గ్రామస్తులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికారు. గ్రామ శివారులోని పేపర్ మిల్లు నుంచి కాలుష్యం అధికమైందని, చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు ఆయన దృష్టికి తీసుకువెళ్లారు. ఎమ్మెల్యే స్పందిస్తూ సమస్యను త్వరలో పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు. బాబర్‌ఖాన్, చిర్ర మల్లయ్య, రఘు, తిరుపతిరెడ్డి, జగన్, సుదర్శన్‌గౌడ్, నర్సింహ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



మర్పల్లిలో ఇటీవల నిర్మించిన ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్ భవనం



ముగిసిన సుదర్శన హోమం

» ఘనంగా మహాలక్ష్మీ నవగ్రహ పూజలు

» కనుల పండువగా పుష్పోత్సవం




హోమంలో భక్తులు

కడ్తాల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడ్తాల మండల కేంద్రంలోని శ్రీ భూనీల సమేత చెన్నకేశవ స్వామి దేవాలయంలో సుదర్శనహోమం, మహాకుంభాభిషేకం, పుష్పోత్సవ కార్యక్రమాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. రెండు రోజుల పాటు నిర్వహించిన ఆయా కార్యక్రమాలకు భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చారు. సుదర్శన హోమం నేపథ్యంలో ఆలయ చైర్మన్ పాలాది అంజనేయులు ఆధ్వర్యంలో భక్తులకు ఏర్పాట్లు చేశారు. ప్రముఖ వేదపండితులు మెళ్లారి వెంకటేశ్వర శర్మ, అర్చకులు తిరునగరి శ్రీమన్నారాయణ, తిరునగరి శ్రీధర్, వేణుగోపాల్ ల ఆధ్వర్యంలో ఉదయం నుంచి సాయంత్రం వరకు పూజలు కొనసాగాయి. ఉత్సవాలలో భాగంగా రెండో రోజు విఘ్నేశ్వర పూజ, మంటపారాదన, నవగ్రహ నక్షత్ర హోమం, మహాలక్ష్మీ హోమం, సుదర్శన హోమం, శతఘటాభిషేకం, పుష్పోత్సం, మహాపూర్ణాహుతి, లలిత, విష్ణు సహస్ర నామం, భగవద్గీత పారాయణం కార్యక్రమాలు నిర్వహించారు. సుదర్శన హోమంలో పది జంటలు పాల్గొన్నాయి. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, స్వప్న దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, ఆలయ ఈవో మోహన్ రావు, మార్కెట్ వైస్ చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహ్మా రెడ్డి, మాజీ ఉప సర్పంచ్ లు జంగారెడ్డి, కడారి రామకృష్ణ, తదితరులు ఉన్నారు.

పక్కాగా వైద్యం

- ఉమ్మడి జిల్లాలో 72 కేంద్రాలకు నిర్మాణం
- రంగారెడ్డి జిల్లాలో 55, వికారాబాద్ జిల్లాలో 17
- రూ.14.38కోట్ల నిధులు కేటాయించిన ప్రభుత్వం

ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు



వికారాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఉమ్మడి జిల్లాలో ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు సొంత భవనాలు నిర్మించనున్నారు. రంగారెడ్డి, వికారాబాద్ జిల్లాల్లో 72 ఆరోగ్య ఉప కేంద్రాలను రూ.14,38,56,000 నిధులతో నిర్మించేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. రంగారెడ్డి జిల్లాలో 55, వికారాబాద్ జిల్లాలో 17 ఆరోగ్య ఉప కేంద్రాలకు సొంత భవనాలు నిర్మించనున్నారు. ఈ నిర్మాణాల పనులు చేపట్టేందుకు రంగారెడ్డి జిల్లాకు రూ.10,98,90,000, వికారాబాద్ జిల్లాకు రూ.3,39,66,000 చొప్పున నిధులను ప్రభుత్వం విడుదల చేసిన విషయం తెలిసిందే.

ఒక్కో కేంద్రానికి రూ.19.98 లక్షలు

వికారాబాద్ జిల్లాలో తాండూరు నియోజకవర్గంలో 6, వికారాబాద్ నియోజకవర్గంలో 6, కొడంగల్ నియోజకవర్గంలో 2, పరిగి నియోజకవర్గంలో 2, చేవెళ్ల నియోజకవర్గం పరిధిలోకి వచ్చే నవాబ్‌పేట మండలంలో ఒక ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలను నిర్మించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల నియోజకవర్గంలో 15, ఇబ్రహీంపట్నంలో 13, రాజేంద్రనగర్‌లో 13, మహేశ్వరంలో 7, శేరిలింగంపల్లిలో 4, కల్వకుర్తిలో 2, షాద్‌నగర్ నియోజకవర్గంలో ఒకటి చొప్పున నిర్మించనున్నారు. జిల్లాల వారీగా ప్రభుత్వం కేటాయించిన నిధులను పీఆర్ ఆర్‌ఈ అధికారులు జెడ్పీ ఖాతాలకు

మిగతా 7వ పేజీలో...

అప్పుడు నాటారు.. ఇప్పుడు తొలగించారు

పచ్చదనం పెంపొందించేందుకు కోట్లాది రూపాయల ప్రభుత్వ ధనాన్ని వెచ్చించి మొక్కలు నాటుతున్నారు. తర్వాత ఏదో ఒక సాకుతో వాటిని నరికేస్తున్నారు. కొత్తూర్ మండల పరిధిలోని తిమ్మాపూర్ నుంచి మక్తగూడ వరకు బీటీ రోడ్డు విస్తరణకు నిధులు మంజూరు కావడంతో ఇటీవల నిర్మాణ పనులు ప్రారంభమయ్యాయి. రోడ్డుకు ఇరువైపులా కొన్నేళ్ల క్రితం వందలాది మొక్కలు నాటారు. అవి ఇప్పుడు పెరిగి పెద్దగా అయ్యాయి. ప్రస్తుతం రోడ్డు విస్తరణలో భాగంగా ఎక్సవేటర్లతో ఆ చెట్లను తొలగిస్తున్నారు. భవిష్యత్తును దృష్టిలో పెట్టుకొని అప్పుడే రోడ్డుకు దూరంగా మొక్కలు నాటి ఉంటే బాగుండేదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కొత్తూర్, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి)



మక్తగూడ వద్ద భారీ వృక్షాన్ని తొలగిస్తున్న దృశ్యం



నేల కూలిన భారీ వృక్షం

భగవంతుడి నామస్మరణలో ఉండాలి

కేశంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ సుఖాలకు పోకుండా భగవంతుడి నామస్మరణలో ఉండాలని ముక్తేశ్వరానంద స్వామి అన్నారు. మండల పరిధిలోని నిర్దవెల్లి గ్రామానికి చెందిన పల్లాటి కృష్ణయ్య నివాసంలో ఆదివారం కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో విష్ణుసహస్రనామ పారాయణం, భగవద్గీత యజ్ఞం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మనిషి జీవిత పరమార్థం తెలియాలంటే విష్ణు సహస్ర నామ పారాయణం చేయాలన్నారు. 30 ఏళ్లుగా తొమ్మిదిరేకుల కిషన్ ప్రభు ధర్మ ప్రచార సమితి ఆధ్వర్యంలో గీత యజ్ఞం, విష్ణు సహస్రనామ పారాయణం నిర్వహిస్తుండడం అభినందనీయమన్నారు. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు.



సమావేశంలో మాట్లాడుతున్న ముక్తేశ్వరానంద స్వామి



వేదిక వద్దకు వెళ్లే దారిలో ఏర్పాటు చేసిన గ్రీనరీ

200 మంది వలంటీర్లతో సేవలు

అతిథులకు సౌకర్యాలను కల్పించేందుకు జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో సేవలందించే ఈవెంట్ సంస్థ ఆధ్వర్యంలో 200 మంది వలంటీర్లను సిద్ధం చేశారు. వీరంతా కూడా ఆదివారం రాత్రి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ప్రాంగణంలోని సభావేదికలను పరిశీలించారు. ప్రధానంగా సమావేశాలు నిర్వహించే సభావేదికలతో పాటు డైనింగ్ హాళ్లు, తదితర ప్రాంతాల్లో వారు సేవలందించనున్నారు.

ఫ్యూచర్ అదిరేలా..

(ఐదో పేజీ తరువాయి)

వ్యాపార దిగ్గజాలను పెట్టుబడులు ఆకట్టుకునేలా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో వేదికలను సిద్ధం చేసింది. ఈ సదస్సుకు ఆరు ఖండాలు, 44 దేశాల నుంచి పారిశ్రామిక దిగ్గజాలు హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో ప్రపంచ దేశాలకు చెందిన ప్రముఖ మల్టీనేషనల్ కంపెనీలు తెలంగాణలో నెలకొల్పేలా విజన్- 2047 సంబంధించిన ప్రభుత్వ లక్ష్యాలు, ఆలోచనలను కళ్లకు కట్టినట్టుగా వివరించేందుకు సభా ప్రాంగణంలో భారీ స్థాయిలో ఎల్ఈడీ స్ర్కీన్లను ఏర్పాటు చేసింది. దేశ, విదేశాల నుంచి 1,500 మంది వరకు పలు సంస్థలకు చెందిన ప్రతినిధులు, మరో 1,500 మంది అతిథులు ఈ సమ్మిట్‌లో పాల్గొనున్నారు. వీరికి అవసరమైన అన్ని వసతులు కల్పించేలా చర్యలు చేపట్టారు. అతిథుల కోసం ప్రత్యేకంగా భోజనశాలలను ఏర్పాటు చేశారు.

పటిష్టంగా కమ్యూనికేషన్ వ్యవస్థ

సమ్మిట్ జరిగే ప్రాంగణమంతా పచ్చని అందాలతో తీర్చిదిద్దారు. పూల మొక్కలు, పచ్చని గడ్డిని ఏర్పాటు చేశారు. అతిథుల కోసం సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించేందుకు వేదికను సిద్ధం చేశారు. వ్యాపార దిగ్గజాలు హెలీక్యాప్టర్లు, విమానాల్లో దిగేందుకు మూడు హెలీప్యాడ్లను ఏర్పాటు చేసింది. కమ్యూనికేషన్ వ్యవస్థ పటిష్టంగా ఉండేలా ప్రత్యేకంగా సెల్ టవర్లను నెలకొల్పింది. విద్యుత్ సరపరాలో అంతరాయం జరక్కుండా జనరేటర్లు సైతం ఏర్పాటు చేశారు.

వీడియోకాన్ఫరెన్స్ ద్వారా..

గ్లోబల్ సమ్మిట్‌కు పెద్ద సంఖ్యలో అతిథులు హాజరు కానుండటంతో ఎలాంటి లోటుపాట్లు లేకుండా తగిన ఏర్పాట్లు పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఉన్నతాధికారులకు సూచించారు. సభా ప్రాంగణాన్ని వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు.

నిరంతరం పర్యవేక్షణ

గ్లోబల్ సమ్మిట్ విజయవంతం చేసేందుకు 25 శాఖలకు చెందిన ముఖ్య కార్యదర్శులు, కార్యదర్శులు, పలు శాఖలకు డైరెక్టర్లు, అదనపు డైరెక్టర్లు, జిల్లా యంత్రాంగం, పోలీసు ఉన్నతాధికారులు సభా ప్రాంగణంలో ప్రత్యేకంగా కార్యాలయాలను ఏర్పాటు చేసుకుని నిరంతరం పర్యవేక్షిస్తున్నారు. ఈ సమ్మిట్ పూర్తయ్యేవరకు వీరంతా కూడా అతిథులు అసౌకర్యానికి గురికాకుండా తగిన చర్యలు తీసుకోనున్నారు. అన్ని శాఖల అధికారులకు రిమోట్‌లను అందజేశారు. ఎప్పటికప్పుడు ఏయే ప్రాంతాల్లో ఏమీ కావాలన్న అంశాలపై సమాచారాన్ని అందుకుని సేవలందించేందుకు సిద్ధం చేస్తున్నారు.



విద్యుత్ వెలుగులో గ్లోబల్ సమ్మిట్ ముఖ ద్వారం

దార్శనికతను ప్రతిబింబించేలా..

రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమ్మిట్ విచ్చేసే అతిథులకు వివరించేందుకు, తెలంగాణ దార్శనికతను ప్రతిబింబించేలా ప్రభుత్వం ప్రత్యేక స్టాళ్లను ఏర్పాటు చేసింది. మూసీ ప్రక్షాళన, తెలంగాణ పారిశ్రామిక విధానం, హైదరాబాద్‌లోని మెట్రో, పలు శాఖలకు చెందిన సంక్షేమ పథకాలు, హైదరాబాద్ నగరంలోని అంతర్జాతీయ స్థాయి సంస్థలు జీఎంఆర్ ఎయిర్‌పోర్టు, మెఘా, క్రెడాయ్, ఐకాం, తదితర దిగ్గజ సంస్థలకు చెందిన స్టాళ్లను ప్రత్యేకంగా ఏర్పాటు చేశారు.



ఏర్పాట్లను పరిశీలించిన మంత్రులు

రెండు రోజుల పాటు ప్రతిష్టాత్మకంగా నిర్వహించనున్న గ్లోబల్ సమ్మిట్‌కు ఫ్యూచర్ సిటీ డెవలప్‌మెంట్ అథారిటీ ఎండీ శశాంక నేతృత్వంలో చేపట్టిన పనులను ఆదివారం మంత్రులు పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాయంత్రం సుమారు 31 డ్రోన్లతో పోలీసు అధికారులు ప్రాంగణంలో రిహార్సల్ చేశారు. దీంతో పాటు కళాకారులతో పలు సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహించారు. ఆదివారం ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు గ్లోబల్ సమ్మిట్ పనులను పరిశీలించి నగరానికి వెళ్లిన మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి రాత్రి 8గంటలకు తిరిగి సమ్మిట్ ప్రాంగణానికి చేరుకున్నారు పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు సలహాలు ఇచ్చారు.



వీఐపీ ద్వారం



వేదిక వద్ద జరుగుతున్న ఏర్పాట్లు



బందోబస్తులో స్థానిక పోలీసులు

పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలి

యాచారం, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల్లో పార్టీ బలపరిచిన అభ్యర్థులను గెలిపించుకోవాలని, పార్టీకి వ్యతిరేకంగా పని చేస్తే వేటు తప్పదని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని మంతన్ గౌరెల్లిలో విలేకరులతో మాట్లాడారు. పార్టీ లైన్ దాటి నామినేషన్ వేసిన వారు తక్షణమే ఉపసంహరించుకోవాలన్నారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆదేశానుసారంగా కార్యకర్తలు నడుచుకోవాలని సూచించారు. మాల్‌లో పార్టీ బలపరిచిన సుబానికి వ్యతిరేకంగా మాజీ జెడ్పీటీసీ జంగమ్మాయాదయ్య కాంగ్రెస్ బలపరచిన అభ్యర్థిని సర్పంచ్ ఎన్నికలకు ప్రతిపాదించడం దారుణమన్నారు. పార్టీకి భిన్నంగా నడచుకోవడంతో వారిని జిల్లా అధ్యక్షుడి ఆదేశానుసారం పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు తెలిపారు.



మాట్లాడుతున్న బీఆర్ఎస్ యాచారం మండల అధ్యక్షుడు రమేష్‌గౌడ్

ఒక సర్పంచ్, 45 వార్డులు ఏకగ్రీవం

షాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రెండో విడత పంచాయతీ ఎన్నికలకు సంబంధించి షాబాద్ మండలంలో ఒక సర్పంచ్, 45 వార్డులు ఏకగ్రీవం అయ్యాయి. మండలంలో 41 గ్రామ పంచాయితీలు, 352 వార్డు మెంబర్లకు, చర్లగూడ సర్పంచ్, 45 వార్డు మెంబర్లు ఏకగ్రీవం అయ్యాయి. బరిలో 40 గ్రామ పంచాయతీలకు 111 సర్పంచ్ అభ్యర్థులు, 352 వార్డు స్థానాలకు 794 మంది ఎన్నికల బరిలో నిలిచారని ఎన్నికల అధికారులు తెలిపారు. గ్రామాల్లో నువ్వా నేనా అన్నట్లుగా ప్రచారం ఊపందుకుంది.

ఓటు హక్కును స్వేచ్ఛగా వినియోగించుకోవాలి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): హిమాయత్ నగర్‌లో పేదలకిచ్చిన భూముల జోలికి పోవొద్దని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్‌కు చెందిన గ్రామస్తులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిశారు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 151లోని ప్రభుత్వ స్థలంలో 60 గజాల చొప్పన ఇళ్ల పట్టాలను ఇచ్చిందని.. ఇప్పటి ప్రభుత్వం ఆ భూమిని తీసుకునేందుకు ప్రయత్నిస్తుందని గ్రామస్తులు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో చంద్రకళకు ఫోన్ చేసి మాట్లాడారు. భూమి చదును చేసే పనులను వెంటనే ఆపాలని, ఈ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ హిమాయత్ నగర్‌లోని 151 సర్వేలో పట్టాలు ఉన్న పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేంత వరకు అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ముదిగొండ రవియాదవ్, షాబాద్ శ్యాంరావు, షాబాద్ మధు, యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, మల్కాపురం నర్సింహారెడ్డి, కుమ్మరి శ్రీను, కట్టమీది శ్రీను, కట్టమీది ప్రకాష్, జల్లెల మల్లేష్ యాదవ్, రెడ్డిపల్లి సుమన్, నాగేష్ గౌడ్, షాబాద్ గిరి, పద్మరావు గౌడ్, ప్రకాష్, గోపాల్ నాయక్, అన్షుల్, కృష్ణ, మహ్మద్ అఖీల్, కంజర్ల రాజు, ముదిగొండ శ్రీనివాస్ యాదవ్, తదితరులు ఉన్నారు.



పోమాల్‌పల్లిలో ఓటర్లతో మాట్లాడుతున్న సీఐ నరహరి

ఒకటే ఊరు.. రెండు పంచాయతీలు



మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు అదంతా ఒకే ఊరు.. ప్రత్యేక పంచాయతీగా విభజించేటప్పుడు అధికారుల సాంకేతిక తప్పిదంతో గ్రామం ముక్కలైంది. సగం ఊరు ఒక పంచాయతీగా.. మరో సగం మరో పంచాయతీకి అనుబంధంగా కొనసాగుతోంది. ఫలితంగా ఇక్కడ అభివృద్ధి ఎండమావిలా మారింది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని పెద్దమంగళారం పంచాయతీకి అనుబంధంగా కొనసాగిన ఎల్కగూడ గ్రామాన్ని 2018లో ప్రత్యేక పంచాయతీగా ఏర్పాటు చేశారు. మిగతా సగం గ్రామం కుత్బుద్దీన్‌గూడ పంచాయతీలో కొనసాగుతోంది. ఎల్కగూడ అంతా పంచాయతీ కిందకు తేవాలని గ్రామస్థులు ఎంత మొరపెట్టుకున్నా పట్టించుకునేవారు లేరు. ప్రస్తుతం ఎల్కగూడ సర్పంచ్ పదవిని జనరల్ మహిళకు రిజర్వు చేశారు. గ్రామంలో మొత్తం ఆరు వార్డులున్నాయి. కుత్బుద్దీన్‌గూడ సర్పంచ్ స్థానాన్ని బీసీ జనరల్‌కు కేటాయించగా ఇక్కడ మొత్తం ఎనిమిది వార్డులున్నాయి. వీటిలో రెండు వార్డులు సగ భాగం ఎల్కగూడలో ఉన్నాయి.



బాబ్బాబు జర తప్పుకోవా..



రెబల్ అభ్యర్థులకు బుజ్జగింపులు

కులకచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో అభ్యర్థుల్లో ఆందోళన మొదలైంది. ఈ నెల 17న జరిగే మూడో విడత ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు విరమించుకునే సమయం మంగళవారంతో ముగియనుండటంతో ప్రధాన పార్టీల్లో రెబల్స్ గుబులు పట్టుకుంది. కులకచర్ల మండలంలో మొత్తం 33 పంచాయతీలు ఉండగా 144 మంది, 280 వార్డులకు 576 మంది అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒక్కో పంచాయతీలో ఇద్దరి నుంచి ఎనిమిది మంది వరకు నామినేషన్ వేశారు. మండలంలోని బోట్యానాయక్ తండాలో సర్పంచ్‌గా సంతోష్, వార్డు సభ్యులకు ఒక్కొక్కరు నామినేషన్ వేయడంతో దాదాపు ఏకగ్రీవం అయినట్లే. తిరుమలాపూర్‌లో సర్పంచ్‌కు మాధవి ఒక్కరే నామినేషన్ వేయగా వార్డులకు ఇద్దరు, ముగ్గురు నామినేషన్లు వేశారు. రెబల్స్ అభ్యర్థులను బుజ్జగించే ప్రయత్నంలో పార్టీల నాయకులు నిమగ్నమయ్యారు. ఎలాగైనా మండలంలో అధిక స్థానాలు గెలిచి బీఆర్ఎస్ సత్తా చాటాలని నాయకులు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నారు. మండల కేంద్రంతో పాటు పలు గ్రామాల్లో గెలుపొంది పట్టు సాధించాలని బీజేపీ చూస్తోంది. స్వతంత్ర అభ్యర్థులు మాత్రం విరమించుకునేందుకు ససేమిరా అంటున్నారు. ఎలాగైనా ఒప్పించాలని ఆయా పార్టీల నాయకులు బుజ్జగింపులు మొదలు పెట్టారు.

బొంరెడ్డిపల్లిలో తప్పని పోటీ

» సర్పంచ్ పదవికి కుదరని ఏకాభిప్రాయం



కులకచర్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసేందుకు అభ్యర్థుల మధ్య పోటా పోటీ ఏర్పడింది. మండలంలోని బొంరెడ్డిపల్లి(జనరల్ మహిళ) పంచాయతీ సర్పంచ్ పదవికి అధికార పార్టీకి చెందిన ఇద్దరు నాయకులు పోటీ పడ్డారు. దీనిపై గ్రామ పెద్దలు మూడు రోజుల క్రితం పోటీ చేసే అభ్యర్థులతో సమావేశమయ్యారు. గ్రామంలో ఆంజనేయస్వామి ఆలయ నిర్మాణం పెండింగ్‌లో ఉందని, సర్పంచ్ పదవిని ఏకగ్రీవం చేసి వచ్చే డబ్బుతో పూర్తి చేద్దామని నిర్ణయించారు. అందుకు ఓ అభ్యర్థి రూ.10 లక్షలు ఇస్తానని ముందుకొచ్చారు. మరో అభ్యర్థి రూ.13 లక్షలు ఇస్తామని ప్రకటించినా మరో అభ్యర్థి అంగీకరించకపోవడంతో ఏకాభిప్రాయం కుదరలేదు. దీంతో ఇద్దరు అభ్యర్థులు పోటీలో ఉన్నారు. ఒకే పార్టీలో ఇద్దరు పోటీ పడుతూ నామినేషన్ వేశారు. ఆ పార్టీ అధిష్టానం రంగంలోకి దిగి రాజీకుదిర్చితే బాగుంటుందని గ్రామస్థులు అభిప్రాయ పడుతున్నారు.



ముమ్మరంగా వాహనాల తనిఖీ

చౌదరిగూడ, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అధికారులు ముమ్మరంగా వాహనాల తనిఖీ చేపట్టారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్ వద్ద పరిగి - షాద్‌నగర్ రహదారిపై ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులో రెవెన్యూ, పోలీస్ అధికారులు వాహనాలను తనిఖీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ అసిస్టెంట్ మహేందర్‌గౌడ్ పాల్గొన్నారు.

కడ్తాలలో పోటాపోటీ

సర్పంచ్ బరిలో భిక్షపతి, ఆనంద్

- 14 వార్డుల్లో ఒకటి ఏకగ్రీవం
- 13 వార్డులకు 46 మంది పోటీ
- గెలుపే లక్ష్యంగా వ్యూహాలు
- జోరుగా ఇంటింటి ప్రచారం
- ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి ఎత్తుగడలు



కడ్తాల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): రాజకీయంగా చైతన్యం కలిగి రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కడ్తాలలో పంచాయతీ ఎన్నికల పోరు రసవత్తరంగా సాగుతోంది. సర్పంచ్ పదవిని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. గెలుపే లక్ష్యంగా అభ్యర్థులు పావులు కదుపుతున్నారు. నామినేషన్ల ఉపసంహరణ ఘట్టం ముగియడంతో అభ్యర్థులు ప్రచారాలపై దృష్టి సారించారు. జిల్లాలో మేజర్ పంచాయతీల్లో ఒక్కటైన కడ్తాల సర్పంచ్ పీఠాన్ని దక్కించుకోవాలని ఇరు పార్టీలు పోరుకు దిగాయి.

ఏడుగురిలో ఐదుగురి ఉపసంహరణ

5,573 మంది ఓటర్లు ఉన్న కడ్తాలలో పురుషులు 2,821, స్త్రీలు 2,751 మంది, ఇతరులు ఒకరు ఉన్నారు. 14 వార్డులు కలిగిన కడ్తాల్ పంచాయతీని రిజర్వేషన్లలో భాగంగా ఎస్సీ జనరల్‌కు కేటాయించారు. సర్పంచ్ పదవికి మొత్తం ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారు. ఐదుగురు నామినేషన్లను ఉపసంహరించుకోగా పోటీలో ఇద్దరు ఉన్నారు. కాగా, 14 వార్డులకు ఒకటి ఏకగ్రీవం కాగా 13 వార్డులకు 46 మంది బరిలో ఉన్నారు. సర్పంచ్ అభ్యర్థులుగా అధికార కాంగ్రెస్ మద్దతుతో మాజీ వార్డు సభ్యుడు రాయికంటి భిక్షపతి, బీఆర్ఎస్ మద్దతుతో బావండ్లపల్లి ఆనంద్ పోటీలో నిలిచారు. బరిలో నిలిచిన ఇద్దరూ స్థానికంగా గుర్తింపు ఉన్న వారు కావడంతో ఓటర్లు ఎటువైపు మొగ్గు చూపుతారోనని చర్చ కొనసాగుతుంది.



రాయికంటి భిక్షపతి



బావండ్లపల్లి ఆనంద్

జోరందుకున్న ప్రచారం

కడ్తాల సర్పంచ్ స్థానాన్ని చేజిక్కుంచుకునేందుకు కాంగ్రెస్, బీఆర్ఎస్ సర్వశక్తులొడ్డుతున్నాయి. ఇప్పటికే భిక్షపతి, ఆనంద్ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఇక్కడ జన బలంతోపాటు ధన బలం రాజకీయాలను శాశించే పరిస్థితి ఉంది. కడ్తాల సమీపంలో పోర్త్ సిటీ ఏర్పాటు, గ్రీన్ ఫీల్డ్ రోడ్డు నిర్మాణం, కొత్తగా వెంచర్లు వెలుస్తుండడం, భూముల ధరలు ఎకరా మూడు కోట్లకు పైగా పలుకుతుండడంతో కడ్తాల సర్పంచ్ పదవికి మునుపెన్నడూ లేని విధంగా పోటీ నెలకొంది. కడ్తాల సర్పంచ్ పదవి చేజిక్కించుకునేందుకు స్థానిక ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి మంతనాలు మొదలు పెట్టారు. బీజేపీ నాయకులు బీఆర్ఎస్ అభ్యర్థి ఆనంద్‌కు మద్దతు తెలుపుతున్నారు. భిక్షపతి గతంలో రెండు సార్లు వార్డు సభ్యుడిగా పనిచేయగా, ఆనంద్ మండల పరిషత్ ఉపాధ్యక్షుడిగా సేవలందించారు. కాగా, కడ్తాలలో ఈ నెల 14న ఎన్నికలు జరుగనున్నాయి.

3,678 నామినేషన్లు

పూర్తయిన తుదివిడత నామినేషన్ల పరిశీలన

- ఆరు వార్డు సభ్యుల నామినేషన్ల తిరస్కరణ
- డబుల్ సెట్లను ఒకే సెట్‌గా గుర్తింపు
- 157 సర్పంచ్ స్థానాలకు 740, 1,340 వార్డులకు 2,938



కులకచర్ల క్లస్టర్‌లో నామినేషన్లను పరిశీలిస్తున్న అధికారులు

పరిగి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పరిగి సబ్ డివిజన్ పరిధిలోని ఐదు మండలాల్లో పంచాయతీ ఎన్నికల నామినేషన్ల పత్రాల పరిశీలన పూర్తయింది. స్క్రూట్నీ అనంతరం నామినేషన్ల సంఖ్య 3,678గా తేలింది. పరిగి, దోమ, పూడూరు, కులకచర్ల, చౌడాపూర్ మండలాల్లో మొత్తం 157 పంచాయతీల్లోని సర్పంచ్ స్థానాలకు 909, 1,340 వార్డుల స్థానాలకు మొత్తం 3,964 నామినేషన్లు దాఖలు అయిన సంగతి విదితమే. వీటిని ఆయా క్లస్టర్ కేంద్రాల్లో అధికారులు పరిశీలించారు. అలాగే వార్డు సభ్యులకు ఆరు నామినేషన్లను తిరస్కరించారు. కులకచర్ల మండలం రాంపూర్‌లో ఎనిమిదో వార్డుకు శంకర్ వేసిన నామినేషన్‌ను తిరస్కరించారు. ఘణాపూర్ పంచాయతీ పరిధిలోని 9వ వార్డులో దయ్యాల హన్మంత్ నామినేషన్‌ను తిరస్కరించారు. దోమ మండలం బుద్లాపూర్ పంచాయతీ పరిధిలోని మూడో వార్డులో రెండు నామినేషన్లను తిరస్కరించారు. పూడూరు మండలం బాకాపూర్‌లో ఆరో వార్డులో ఒక నామినేషన్ తిరస్కరణ జరిగిందని అధికారులు తెలిపారు. నామినేషన్ల పరిశీనలలో ఒక్కో అభ్యర్థి రెండు, మూడు సెట్లు నామినేషన్లు సమర్పించినప్పటికీ వాటిని ఒకే సెట్‌గా పరిగణనలోకి తీసుకున్నారు. పరిశీలన తర్వాత 157 సర్పంచ్ స్థానాలకు 740, నామినేషన్‌లు ఉన్నాయని తెలిపారు. వార్డు సభ్యులకు 2,938 నామినేషన్లుగా లెక్క తేలిందన్నారు. సోమ, మంగళవారాల్లో నామినేషన్‌ల ఉపసంహరణకు అవకాశం ఉంది. అయితే ఈ రెండు రోజుల్లో భారీగా నామినేషన్ల ఉపసంహరణ జరిగే అవకాశం ఉందని అధికారులు బావిస్తున్నారు. మంగళవారం సాయంత్రం ఉపసంహరణ తర్వాత పోటీలో నిలిచే అభ్యర్థుల జాబితాను ప్రకటించనున్నారు.

కాంగ్రెస్‌తోనే పల్లెల్లో ప్రగతి

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి



పార్టీలో చేరిన వారికి కండువా కప్పుతున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి

ఆమనగల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాకనే పల్లెలు ప్రగతిపథంలో దూసుకుపోతున్నాయని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. రావిచెడ్ గ్రామానికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరారు. వారికి కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. కార్యక్రమంలో టీపీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి, మార్కెట్ వైస్ చైర్మన్ భాస్కర్‌రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల నియమావళిని పాటించాలి

» జిల్లా ఎన్నికల సహాయ అధికారి మాధురి



మాట్లాడుతున్న మాధురి

ఆమనగల్లు, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నికల నియమావళిని సర్పంచ్, వార్డు సభ్యుల అభ్యర్థులు విధిగా పాటించాలని జిల్లా సహయ ఎన్నికల అధికారిణి కుసుమ మాధురి ఆదేశించారు. ఆమనగల్లు మండల పరిషత్ కార్యాలయంలో ఆదివారం అభ్యర్థులకు, అధికారులకు అవగాహన కల్పించారు. ఎన్నికల ఖర్చుల వివరాలు రోజు వారీగా ఎన్నికల పరిశీలకుడు ఆంజనేయులుకు అందించాలన్నారు. కార్యక్రమంలో అధికారులు శ్రీధర్, అనంత్‌రెడ్డి, కృష్ణయ్య, తదితరులు పాల్గొన్నారు.



చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి సమక్షంలో బీజేపీలో చేరుతున్న నాయకులు

చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరేద్దాం

- బీజేపీ అభ్యర్థిని గెలిపిస్తే గ్రామానికి రూ.10 లక్షలు
- చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చేవెళ్ల, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): వచ్చే మున్సిపల్ ఎన్నికల్లో చేవెళ్లలో బీజేపీ జెండా ఎగరేయాలని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి అన్నారు. ఆదివారం మున్సిపాలిటీ పరిధిలోని దేవునిఎర్రవల్లి వార్డుకు చెందిన 30 మంది బీఆర్ఎస్ నాయకులు మాజీ ఎమ్మెల్యే కేఎస్ రత్నం ఆధ్వర్యంలో ఎంపీ సమక్షంలో బీజేపీలో చేరారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ.. సర్పంచ్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని గెలిపించిన గ్రామానికి ఎంపీ నిధులు రూ.10 లక్షలు అందిస్తామని హామీ ఇచ్చారు. గ్రామాల్లో గుంతల రోడ్లను పూడ్చివేస్తామని, కోతుల బెడద నుంచి ఉపషమనం కల్పిస్తామన్నారు. కోతులను పట్టుకునేందుకు ట్రక్కులు ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో పార్టీ చేవెళ్ల మున్సిపల్ అధ్యక్షుడు అనంతరెడ్డి, బీఎస్ఎన్ఎల్ బోర్డు సభ్యుడు సామ మాణిక్యరెడ్డి, బీజేపీ నాయకులు దేవుని శర్వలింగం, డాక్టర్ వైభవ్‌రెడ్డి, శంకర్, చీర శ్రీనివాస్, తిరుపతిరెడ్డి, పత్తి సత్యనారాయణ, శ్రీకాంత్‌రెడ్డి, మాణయ్య, వెంకటేశ్, విఠల్‌రెడ్డి, చంద్రకాంత్, కృష్ణారెడ్డి, రవి, అభిషేక్ రెడ్డి, నరేందర్‌గౌడ్, యాదయ్య, మహేందర్, కరుణాకర్, భూపాల్‌రెడ్డి, రాకేశ్‌రెడ్డి, దాయకర్ రెడ్డి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి సాధ్యం

షాబాద్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాల అభివృద్ధి సాధ్యమని మాజీ ఎమ్మెల్యే కెఎస్ రత్నం అన్నారు. ఆదివారం మండల పరిధిలోని మల్లారెడ్డిగూడకు చెందిన కూతురు గోపాల్ తన అనచరులతో కలిసి బీజేపీలో చేరారు. వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో బీజేపీ మండలాధ్యక్షుడు మద్దూరి మాణయ్య, తదితరులు పాల్గొన్నారు.



హిమాయత్ నగర్ వాసులతో సబితా ఇంద్రారెడ్డి

పేదల భూముల జోలికి పోవద్దు

» ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): హిమాయత్ నగర్‌లో పేదలకిచ్చిన భూముల జోలికి పోవొద్దని, వచ్చేది బీఆర్ఎస్ ప్రభుత్వమేనని మాజీ మంత్రి, ఎమ్మెల్యే పట్లోళ్ల సబితా ఇంద్రారెడ్డి అన్నారు. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని హిమాయత్ నగర్‌కు చెందిన గ్రామస్థులు ఆదివారం క్యాంపు కార్యాలయంలో ఆమెను కలిశారు. గతంలో ఉన్న కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 151లోని ప్రభుత్వ స్థలంలో 60 గజాల చొప్పన ఇళ్ల పట్టాలను ఇచ్చిందని.. ఇప్పటి ప్రభుత్వం ఆ భూమిని తీసుకునేందుకు ప్రయత్నిస్తుందని గ్రామస్థులు మొరపెట్టుకున్నారు. స్పందించిన ఎమ్మెల్యే ఆర్డీవో చంద్రకళకు ఫోన్ చేసి మాట్లాడారు. భూమి చదును చేసే పనులను వెంటనే ఆపాలని, ఈ విషయంలో కలెక్టర్‌తో మాట్లాడుతానని చెప్పారు. అనంతరం సబితా ఇంద్రారెడ్డి మాట్లాడుతూ హిమాయత్ నగర్‌లోని 151 సర్వేలో పట్టాలు ఉన్న పేదలందరూ ఇళ్లు నిర్మించుకునేంత వరకు అండగా ఉంటానన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో ముదిగొండ రవియాదవ్, షాబాద్ శ్యాంరావు, షాబాద్ మధు, యువజన సంఘం అధ్యక్షుడు కుమ్మరి విఠల్, మల్కాపురం నర్సింహారెడ్డి, కుమ్మరి శ్రీను, కట్టమీది శ్రీను, కట్టమీది ప్రకాష్, జల్లెల మల్లేష్ యాదవ్, రెడ్డిపల్లి సుమన్, నాగేష్ గౌడ్, గిరి, పద్మరావు గౌడ్, ప్రకాష్, గోపాల్ నాయక్, అన్షుల్, కృష్ణ, మహ్మద్ అఖిల్, రాజు, శ్రీనివాస్ యాదవ్ ఉన్నారు.

'పక్కా'గా వైద్యం

(ఐదో పేజీ తరువాయి)



బదిలీ చేయనున్నారు. ఒక్కో ఆరోగ్య ఉప కేంద్రం/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరానికి రూ.19.98 లక్షల చొప్పున వెచ్చించనున్నారు. మంజూరై సొంత భవనాలు లేని ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు చాలా రోజుల తర్వాత నిర్మాణం కోసం ప్రభుత్వం నిధులు కేటాయించింది. భవన నిర్మాణం పనులను తెలంగాణ స్టేట్ మెడికల్ సర్వీసెస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పర్యవేక్షించనుంది.

ఆరోగ్య ఉపకేంద్రాలివే...

వికారాబాద్ జిల్లాలో పులుమామిడి, కొడంగల్ -ఏ, కొడంగల్ -బీ, దోమ-2, ముజాహిద్‌పూర్, తాండూరు బెగ్గర్స్ కాలనీ, ఘనాపూర్, కుమ్మర్‌గల్లీ, పూడూరుగల్లీ, సాయిపూర్, వడ్డెరగల్లీ, టేకులపల్లి, సిరిపురం, ఆలంపల్లి, గంగారం, కొత్తగడి, శివారెడ్డిపేటల్లో ఆరోగ్య ఉప కేంద్రాలు/ఆయుష్మాన్ ఆరోగ్య మందిరాలకు స్వంత భవనాలు నిర్మించనున్నారు. రంగారెడ్డి జిల్లాలో గుండాల, రేగడి ఘనాపూర్, తంగడపల్లి, రేగడి దోస్వాడ, బాకారం, కేతిరెడ్డిపల్లి, పెద్ద మంగళారం, శ్రీరాంనగర్, దోబీపేట్, పర్వేద, రావులపల్లి, శంకర్‌పల్లి-2, జన్వాడ, కొండకల్, మహరాజ్‌పేట్, నాగన్‌పల్లి, ఇబ్రహీంపట్నం, అంజాపూర్, హయత్‌నగర్, కమ్మగూడ, కోహెడ, సాహెబ్‌నగర్, తుర్కయాంజాల్, వనస్థలిపురం, వినాయక నగర్‌ల్లో నిర్మించనున్నారు. చింతపట్ల, కుర్మిద్ద, మాల్, సుద్దపల్లి, చెర్లకొండ, జిల్లెలగూడ, కొంగరకలాన్, ఎంపీ పటేల్‌గూడ, హర్షగూడ, తుక్కుగూడ, లెనిన్‌నగర్, మీర్‌పేట్, పెద్దగొల్లపల్లి, అత్తాపూర్, బుద్వేల్, హసన్‌నగర్, ఇందిరానగర్, ఎంఎం పహడ్, రాజేంద్రనగర్, బండ్లగూడ, హైదర్‌షాకోట్, ఖానాపూర్, కిస్మత్‌పూర్, మంచిరేవుల, మణికొండ, గచ్చిబౌలి, కొత్తగూడ, నానక్‌రాంగూడ, రాయదుర్గ, స్టేషన్ తిమ్మాపూర్‌లో కొత్త భవనాలు నిర్మించనున్నారు.

పెద్దషాపూర్‌ను ఆదర్శ జీపీగా తీర్చిదిద్దుతా

● ఎన్నికల ప్రచారంలో సర్పంచ్ అభ్యర్థి సునీత సత్యనారాయణగౌడ్



పెద్దషాపూర్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న సర్పంచ్ అభ్యర్థి దేవులపల్లి సునీత సత్యనారాయణగౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): పెద్దషాపూర్‌ను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతామని దేవులపల్లి సునీత సత్యనారాయణగౌడ్ అన్నారు. మండల పరిధిలోని పెద్దషాపూర్ గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న సునీత సత్యనారాయణగౌడ్‌కు జనం నీరాజనం పడుతున్నారు. ఆదివారం గ్రామస్తులతో కలిసి పలు కాలనీల్లో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఎక్కడికి వెళ్లినా ప్రజలు ఆదరిస్తున్నారు. కాగా, గత పాలకులు ఎలాంటి అభివృద్ధి చేయలేదని గ్రామస్తులు ఈ సందర్భంగా ఆమె ఎదుట వాపోయారు. కత్తెర గుర్తుకు ఓటువేసి అత్యధిక మోజార్టీతో గెలిపిస్తే పెద్దషాపూర్‌ను ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా పనిచేస్తానని సునీత సత్యనారాయణగౌడ్ తెలిపారు. ముఖ్యంగా అర్హులైన వారికి పింఛన్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానని, సమస్యలు లేని గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని చెప్పారు. యువతకు ఉపాధి కల్పించే విధంగా కృషి చేస్తానని తెలిపారు. విద్యాభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానని ఆమె హామీ ఇచ్చారు. గ్రామస్తుల సహకారంలో అన్ని రంగాల్లో ముందుకెళ్తామని ఓటర్లకు వివరించారు. కాగా, గతంలో పెద్దషాపూర్ సర్పంచ్‌గా గ్రామానికి ఎంతో సేవ చేశానని ఆమె చెప్పారు. మరోసారి అవకాశం కల్పిస్తే గ్రామ రూపురేఖలు మారుస్తానని ఈ సందర్భంగా సునీత సత్యనారాయణగౌడ్ తెలిపారు.

ఇండిపెండెంట్ అభ్యర్థి మద్దతు సునీతమ్మకే

పెద్దషాపూర్ గ్రామపంచాయతీ ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న కర్రే మీనా ఉమామహేశ్వర్ మద్దతు దేవులపల్లి సునీత సత్యరాయణ గౌడ్‌కు మద్దతు ప్రకటించారు. ఈమేరకు వారి అనుచరులతో కలిసి ఆదివారం సునీతమ్మ ఇంటికి వెళ్లి కలిశారు. గ్రామంలో అభివృద్ధి జరగాలంటే కేవలం దేవులపల్లి కుటుంబానికే సాధ్యమని, అందుకోసమే తమ మద్దతు వారికే ఇస్తున్నామని మీనా ఉమామహేశ్వర్ ఈ సందర్భంగా తెలిపారు. కాగా, మీనా మద్దతులో మరింత బలం పెరిగిందని, సునీతమ్మను భారీ మోజార్టీతో గెలిపిస్తామని ఉమామహేశ్వర్ ధీమా వ్యక్తం చేశారు. నాయకులు గాదె రాజశేఖర్, రఘువీర్ పండిత్, దేవులపల్లి నర్సింహ, శ్రీశైలం యాదవ్, యువ నాయకులు జిల్లా జగదీశ్, కపిల్‌దేవ్, జిల్లా విశాల్, గాదె రామ్మోహన్, కుక్కల నరసింహ, బొర్ర చంద్రశేఖర్, ఉదయ్‌గౌడ్, శ్రీధర్‌బాబు, సయ్యద్ గౌడ్ పాషా, కర్రే శ్రీనివాస్, యాదయ్య, రాజు, జిల్లా శ్రీనివాస్, కిషోర్, జేమ్స్, నవీన్, ఆనంద్, సాయి తదితరులు పాల్గొన్నారు.



సునీత సత్యనారాయణగౌడ్‌కు మద్దతు తెలుపుతున్న ఇండిపెండెంట్ సర్పంచ్ అభ్యర్థి మీనా ఉమామహేశ్వర్

అభివృద్ధిలో మైసిగండిని ఆదర్శంగా నిలుపుతా



మైసిగండిలో ప్రేమ జవహర్‌లాల్ నాయక్ ప్రచారం

కడ్తాల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మైసిగండి సర్పంచ్‌గా ఆదరించి గెలిపిస్తే సేవకుడిగా పనిచేస్తానని కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి జటావత్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్ అన్నారు. మైసిగండిని అన్నిరంగాల్లో అభివృద్ధిపరిచి ఆదర్శంగా నిలుపుతానని ఆమె అన్నారు. కడ్తాల మండలం మైసిగండి కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి జటావత్ ప్రేమ జవహర్‌లాల్ నాయక్ ఆదివారం మైసిగండిలో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కత్తెర గుర్తుకు ఓటేసి తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. ఒక్కసారి సర్పంచ్‌గా అవకాశం ఇస్తే హామీలు ఇవ్వకుండా అభివృద్ధి చేసి చూపుతానన్నారు. ఎంపీ మల్లు రవి, ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు, గ్రామపెద్దల సహకారంతో గ్రామాభివృద్ధికి ప్రత్యేక నిధులు రాబడుతానన్నారు. అన్ని వార్డుల్లో అంతర్గత మురుగు కాల్వలు, సీసీ రోడ్ల నిర్మాణం, వీధిదీపాల ఏర్పాటు, పూర్తిస్థాయిలో మిషన్ భగీరథ నీరు అందేలా చూస్తానన్నారు. మాజీ ఎంపీపీలు సిరోలిపంతూ, కమ్లీమోత్యానాయక్, మాజీ సర్పంచ్‌లు తులసీరామ్ నాయక్, శేఖర్‌గౌడ్, యువజన కాంగ్రెస్ జిల్లా నాయకుడు హీరాసింగ్, నాయకులు కిషన్, తులసీరామ్, బన్సీలాల్, సక్రిబాయి, చిన్న, వినోద్, బాబులాల్, నరేశ్, రాజు, లక్ష్మణ్, విజయ, ఉమ, రమిని బా యి, యమున, మురళి, తదితరులు పాల్గొన్నారు.

నిస్వార్థంగా సేవలందిస్తా : శేఖర్ యాదవ్



గడ్డం శేఖర్‌యాదవ్‌కు మద్దతుగా నర్కూడలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్

శంషాబాద్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): యువకుడినైన తనకు అవకాశం ఇస్తే నిస్వార్థంగా సేవలందిస్తానని కాంగ్రెస్ పార్టీ మద్దతు నర్కూడ సర్పంచ్ అభ్యర్థి గడ్డం శేఖర్‌యాదవ్ అన్నారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా ఆదివారం ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ఉప సర్పంచ్‌గా గ్రామానికి సేవలందించానని, ఇప్పుడు సర్పంచ్‌గా అవకాశం వచ్చిందని, తనను ఆశీర్వదించాలని కోరారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, మంత్రులు, ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్, మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు సహకారంతో గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి బాటలో నడిపిస్తానని చెప్పారు. నిరుపేదలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తానని, అనేక సంక్షేమ పథకాలు ప్రజలకు అందేలా కృషి చేస్తానని చెప్పారు. ఇంటింటి ప్రచారంలో గడ్డం శేఖర్‌యాదవ్‌కు జనం నీరాజనం పలుకుతున్నారు. ఎంతోమంది నిరుపేదలకు సొంత డబ్బుతో పుస్తె, మెట్టెలు అందజేశానని చెప్పారు. వచ్చే ఐదేళ్లలో జిల్లాలోనే నర్కూడ గ్రామాన్ని ఆదర్శ గ్రామ పంచాయతీగా తీర్చిదిద్దుతానని చెప్పారు. సర్పంచ్‌గా గెలిపిస్తే 50 పడకల ఆస్పత్రి, విద్యపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటానన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అండదండతో అత్యధిక నిధులు తెచ్చి గ్రామాభివృద్ధికి ఖర్చు చేస్తానని చెప్పారు. ఇప్పటికే ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేశామని, చాలామందికి కొత్త పింఛన్లు ఇచ్చామని, సర్పంచ్‌గా గెలిపిస్తే మరిన్ని ఇందిరమ్మ ఇళ్లు, పింఛన్లు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు మాట్లాడుతూ యువకుడికి అవకాశమిస్తే గ్రామాన్ని ఎంతో అభివృద్ధి చేస్తారని తెలిపారు. ఎమ్మెల్యే ప్రకాష్‌గౌడ్ అన్న సహకారంతో గ్రామానికి అత్యధిక నిధులు తీసుకొచ్చి అభివృద్ధి చేస్తామని తెలిపారు. గతంలో జడ్పీటీసీగా గ్రామానికి ఎన్నో నిధులు తీసుకొచ్చానని చెప్పుకొచ్చారు.

శేఖర్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించండి

నర్కూడ సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేస్తున్న గడ్డం శేఖర్‌యాదవ్‌ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని స్థానిక ఎమ్మెల్యే ప్రకాశ్‌గౌడ్ పిలుపునిచ్చారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా నర్కూడలో కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడారు. యువకుడైన శేఖర్‌ను గెలిపించుకుంటే మీ గ్రామం అభివృద్ధి చెందుతుందని చెప్పారు. మండలంలోనే నర్కూడకు అత్యధిక నిధులు కేటాయిస్తానని ఎమ్మెల్యే చెప్పారు. ఇప్పటికే ప్రభుత్వం అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తోందని చెప్పారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ నీరటి తన్వీరాజు, మాజీ ఎంపీటీసీలు గౌతమీ అశోక్, లతాశ్రీనివాస్, నీరటి కృష్ణ, విశ్వనాథం, శివాజీ, నీరటి శేఖర్, తోట శేఖర్, సందీప్, ఆసిఫ్ తదితరులు పాల్గొన్నారు.



గ్రామస్తులతో కలిసి శేఖర్ యాదవ్ భారీ ర్యాలీ

ఇంటింటికీ శుద్ధమైన తాగునీరందిస్తా



గాండ్ల విజయలక్ష్మీ అశోక్



ఇంటింటి ప్రచారంలో గాండ్ల విజయలక్ష్మీ అశోక్

కేశంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్వరోగాలకు కాలుషిత నీరే కారణమవుతోందని, తనను సర్పంచ్‌గా గెలిపిస్తే ప్రజారోగ్య పరిరక్షణకు ఇంటింటికీ శుద్ధమైన (ఫిల్టర్)తాగునీరందిస్తానని వేములనర్వ గ్రామ బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి గాండ్ల విజయలక్ష్మీ అశోక్ ఓటర్లకు వాగ్దానం చేశారు. ఆదివారం వేములనర్వ, బలిజరాళ్లతండా, చౌదరిగూడ గ్రామాలలో వార్డు సభ్యులతో కలిసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఉంగరం గుర్తును చూపిస్తూ ఓటువేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. గ్రామంలో భూగర్భ మురుగు కాలువల నిర్మాణం, పరిసరాల పరిశుభ్రత కార్యక్రమాలు చేపడతామని, ప్రజల ఆరోగ్యం కోసం హెల్త్‌క్యాంపులు నిర్వహిస్తామని, చౌదరిగూడెం, బలిజరాళ్ల తండాలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు నిర్మిస్తామని హామీ ఇచ్చారు. ఉంగరం గుర్తుకు ఓటువేసి గెలిపించాలన్నారు.

వేర్వేరు ఘటనల్లో ముగ్గురు దుర్మరణం

● డివైడర్‌ను ఢీకొన్న కారు.. వ్యక్తి మృతి

ఆదిభట్ల, డిసెంబరు 6(ఆంధ్రజ్యోతి): వేర్వేరు ఘటనల్లో ముగ్గురు మృతిచెందారు. డివైడర్‌ను కారు ఢీకొట్టిన ఘటనలో వ్యక్తి మృతి చెందిన ఘటన ఆదిభట్ల పోలీసుస్టేషన్ పరిధిలో ఆదివారం చోటు చేసుకుంది. ఎస్సై సైదయ్య కథనం ప్రకారం.. అల్మాస్‌గూడకు చెందిన నారాయణస్వామి, వంశీకృష్ణ మరో ఇద్దరు యువకులు కలిసి అల్మాస్‌గూడ నుంచి ఇబ్రహీంపట్నంకు కారులో వచ్చారు. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్‌కు వెళుతుండగా తుర్కయంజాల్ మాసబ్ చెరువు కట్ట సమీపంలో కుక్క అడ్డు రావడంతో డ్రైవర్ కారును కుడివైపుకు తిప్పాడు. దాంతో డివైడర్‌ను ఢీకొట్టింది. కారు తలుపులు తెరుచుకోవడంతో వెనుక సీటులో ఉన్న నారాయణ స్వామి(30) రోడ్డుపై పడిపోయాడు. తలకు తీవ్రగాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో ముగ్గురికి తీవ్రగాయాలు కావడంతో నగరంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు.

విందులో పూటుగా మద్యం సేవించి మరొకరు..

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పెళ్లి పార్టీలో ఓ వ్యక్తి పూటుగా మద్యం సేవించి మృతిచెందాడు. మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి కథనం ప్రకారం.. నగరంలోని పంజాగుట్ట శ్రీరాంనగర్ కాలనీకి చెందిన వెంకట కిషోర్‌రెడ్డి(30)కి నాలుగు నెలల క్రితం వివాహమైంది. స్నేహితులు వెంకట కిషోర్ రెడ్డిని పార్టీ ఇవ్వాలని అడిగారు. దాంతో మొయినాబాత్ మున్సిపల్ పరిధిలోని అప్పోజిగూడ పరిధిలోని లోటస్ బ్లిస్ ఫాంహౌస్‌లో శనివారం రాత్రి పార్టీ ఏర్పాటు చేశాడు. వెంకట కిషోర్‌రెడ్డి స్నేహితులతో కలిసి అతిగా మద్యం సేవించాడు. ఆ సమయంలో ఫాంహౌస్‌లోని బాత్రూంలోకి వెళ్లాడు. ప్రమాదవశాత్తు అందులో పడిపోయాడు. స్నేహితులు గమనించి ఆసుపత్రికి తరలించగా.. మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. ఆదివారం వెంకట కిషోర్‌రెడ్డి భార్య.. ఉషారాణి ఫోన్ చేయగా స్నేహితులు విషయం చెప్పారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వీకెండ్ పార్టీలో అనుమానాస్పదంగా వ్యక్తి..

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): తోటి ఉద్యోగులతో కలిసి వీకెండ్ పార్టీలో పాల్గొన్న వ్యక్తి అనుమానస్పదంగా మృతి చెందిన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డ్రీమ్‌వ్యాలీ రిసార్టులో జరిగింది. మొయినాబాద్ సీఐ పవన్ కుమార్ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ ఉప్పల్ ప్రాంతంలోని రామంతపూర్ గాంధీనగర్‌కు చెందిన రాజా ప్రదీప్(62) సమీపంలోని ఫూజీయా హెల్త్‌కేర్ ప్రైవేటు లిమిటెడ్, ఇండికో హెల్త్‌కేర్ ప్రైవేటు లిమిటెడ్‌లో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్నాడు. కంపెనీకి చెందిన దాదాపు వందమంది ఉద్యోగులు కలిసి వీకెండ్ పార్టీలో భాగంగా మొయినాబాద్ మండలం బాకారం జాగీర్ పరిధిలోని ఓ రిసార్టుకు శనివారం వచ్చారు. అందరూ మద్యం సేవించి భోజనం చేసి రిసార్టులోని గదుల్లో నిద్రించారు. ఆదివారం ఉదయం అందరూ లేచి బయటకు రాగా రాజాప్రదీప్ రాలేదు. స్నేహితులు వెళ్లి చూడగా అచేతనంగా పడి ఉండటంతో కొండాపూర్ ఏరియా ఆసుపత్రికి తరలించగా అప్పటికే రాజాప్రదీప్ మృతిచెందినట్లు వైద్యులు తెలిపారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం.. కేసు నమోదు

మొయినాబాద్ రూరల్, డిసెంబరు7(ఆంధ్రజ్యోతి): పని నిమిత్తం ఇంటినుంచి బయటకు వెళ్లిన వ్యక్తి అదృశ్యమైన ఘటన మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పెద్దమంగళారం వార్డుకు చెందిన మందడి రవీందర్‌రెడ్డి(36) వృత్తిరీత్యా ఎలక్ట్రికల్ కాంట్రాక్టర్. శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లగా సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో అదేరోజు రాత్రి అతడి స్నేహితులకు కుటుంబసభ్యులు ఫోన్ చేయగా తాను ఇంటికి వెళ్తున్నట్లు చెప్పాడు. అయితే, ఆచూకీ కొరకు ఎక్కడ వెతికినా ఫలితం లేకపోవడంతో పోలీసులకు అతని భార్య ఫిర్యాదు చేసింది.

అవకాశమివ్వండి.. అభివృద్ధి చేసి చూపిస్తా



వై. శ్రీనివాస్ యాదవ్



ప్రచారంలో సర్పంచ్ శ్రీనివాస్ యాదవ్

కేశంపేట, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లుగా తమ కుటుంబం ప్రజా జీవితంలో ఉందని, ఒక్కసారి సర్పంచ్‌గా అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తానని ఎక్లాస్‌ఖాన్‌పేట కాంగ్రెస్ మద్దతు అభ్యర్థి ఎలగనమోని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఈమేరకు ఆయన కత్తెర గుర్తు చూపిస్తూ గ్రామస్తులను ఓట్లు అభ్యర్థిస్తున్నారు. ఆదివారం ఎక్లాస్‌ఖాన్‌పేట, పొడగుట్టతండాలలో విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తూ.. తాను గెలిస్తే గ్రామాల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరిస్తానని హామీ ఇస్తున్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వెంటనే స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి సహకారంతో ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు మంజూరు చేయించానని తెలిపారు. అర్హులందరికీ ఇందిరమ్మ ఇళ్లు, రేషన్ కార్డులు ఇప్పిస్తానన్నారు. గ్రామంలో నెలకొన్న సమస్యలను ఎమ్మెల్యేకు వివరించి నిధులు తెస్తానన్నారు. ఎక్లాస్‌ఖాన్‌పేట అభివృద్ధికి ఎమ్మెల్యే హామీ ఇచ్చారని చెప్పారు. గ్రామంలో మురుగు కాలువలు, సీసీ రోడ్లు, కమ్యూనిటీ భవనాలకు నిధులు తెస్తానన్నారు. 20 ఏళ్లుగా ఒకే కుటుంబ అధికారంలో ఉండి పాలన చేసిందని, ఈసారి తనను గెలిపించాలని శ్రీనివాస్ యాదవ్ కోరారు. రావుల పెంటయ్య, మదన్‌మోహన్, రావుల శ్రీనివాస్, రాకేష్, రవి కిరణ్, ప్రవీణ్ యాదవ్, శ్రీధర్ యాదవ్, కృష్ణా యాదవ్ తదితరులు ఉన్నారు.

సమస్యలను సవాల్‌గా స్వీకరిస్తా

● కడ్తాలను ప్రగతి బాటలో నడిపిస్తా ● బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్



ఓట్లు అభ్యర్థిస్తున్న బావండ్లపల్లి ఆనంద్

కడ్తాల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): కడ్తాల సర్పంచ్‌గా ఆదరించి గెలిపిస్తే సమస్యలను సవాల్‌గా స్వీకరించి వాటి పరిష్కారానికి కృషి చేస్తానని కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ అన్నారు. ప్రజల ఆకాంక్షలకనుగుణంగా నడుచుకొని కడ్తాలను ప్రగతి బాటలో నడిపిస్తానని ఆయన తెలిపారు. కడ్తాల బీఆర్ఎస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి బావండ్లపల్లి ఆనంద్ ఆదివారం పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం చేపట్టారు. వివిధ కుల సంఘాల నేతలను కలిసి తనకు మద్దతు ఇవ్వాలని అభ్యర్థించారు. రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, డీసీసీబీ డైరెక్టర్ గంప వెంకటేశ్, బీఆర్ఎస్ గ్రామ కమిటీ అధ్యక్షుడు కడారి రామకృష్ణ, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు గంప శ్రీను, మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ లాయక్‌అలీ, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేపట్టారు. తనకు కేటాయించిన ఉంగరం గుర్తుకు ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని ఆనంద్ కోరారు. ప్రజల సమస్యలను తన సమస్యలుగా భావించి వాటి పరిష్కారానికి ఎంతటి పోరాటాలకైనా వెనుకాడబోనన్నారు. రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌కు చేరువలో ఉన్న కడ్తాల అభివృద్ధికి స్థానికుల సహకారంతో సమగ్ర ప్రణాళిక రూపొందించి అమలు చేస్తానని చెప్పారు. కడ్తాల ప్రజల సమస్యలు తనకు తెలుసునని, పదవులు ఉన్నా లేకపోయిన మూడు దశాబ్దాలుగా ప్రజల మధ్యే ఉన్నానని, వైస్ ఎంపీపీగా ప్రజలు ఇచ్చిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహించి సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేశానన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో గ్రామాలు ఎంతగానో ప్రగతి సాధించాయన్నారు. కాగా, వివిధ పార్టీలకు చెందిన పలువురు నాయకులు జీఎల్ఎన్ రెడ్డి, రామకృష్ణ, ఆనంద్, గంప శ్రీను సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నా యకులు మహేశ్, గణేశ్, అంజి, రాంచంద్రి, వెంకటేశ్, మంగళపల్లి నర్సింహ, రవి, సురేశ్, కేశని మహేశ్, సిద్దిగారి వెంకటేశ్, గణేశ్‌గౌడ్, సంతోష్, భగీరథ, చంటి, శేఖర్, అశోక్, చెన్నయ్య, తదితరులు పాల్గొన్నారు.



గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డితో కలిసి ప్రచారం నిర్వహిస్తున్న బావండ్లపల్లి ఆనంద్

సర్పంచ్‌గా గెలిపిస్తే అభివృద్ధి చేసి చూపుతా

● కాంగ్రెస్ మద్దతు కడ్తాల సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి ● జోరుగా ఎన్నికల ప్రచారం



కడ్తాలలో బజ్జీలు వేస్తూ చిరు వ్యాపారులను ఓట్లు అభ్యర్థిస్తున్న రాయికంటి భిక్షపతి

కడ్తాల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా అవకాశం కల్పిస్తే కడ్తాలను అభివృద్ధి చేసి చూపుతానని కాంగ్రెస్ మద్దతు సర్పంచ్ అభ్యర్థి రాయికంటి భిక్షపతి అన్నారు. ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ సేవ చేస్తానని ఆయన తెలిపారు. కాంగ్రెస్ మద్దతు కడ్తాల సర్పంచ్ అభ్యర్థిగా భిక్షపతి ఆదివారం గ్రామ పంచాయతీ పరిధిలోని పలు వార్డుల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, మాజీ సర్పంచ్ వేణుగోపాల్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యనాయక్, పట్టణాధ్యక్షుడు మాలె మల్లేశ్ గౌడ్, కాంగ్రెస్, యువజన కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, కార్యకర్తలతో కలిసి ఇంటింటికీ తిరిగి కత్తెర గుర్తుకు ఓటేసి సర్పంచ్‌గా తనను గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రెండుసార్లు వార్డు సభ్యుడిగా అవకాశం ఇచ్చారని.. గ్రామాభివృద్ధికి, ప్రజల సమస్యల పరిష్కారానికి తానెంతో కృషి చేశానని చెప్పారు. ప్రస్తుతం సర్పంచ్‌గా పోటీ చేస్తున్న తనను గెలిపిస్తే కడ్తాలను అభివృద్ధిలో అగ్రభాగాన నిలుపుతానన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉండడం, ఎంపీగా కాంగ్రెస్‌కు చెందిన మల్లు రవి, ఎమ్మెల్యేగా అధికార పార్టీకి చెందిన కసిరెడ్డి నారాయణరెడ్డి ఉన్నారని, వారి సహకారంతో కడ్తాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు రాబడుతానని భిక్షపతి వివరించారు. కడ్తాల సమీపంలో ఫోర్త్‌సిటీ ఏర్పాటుతో ఈ ప్రాంతం కూడా వేగవంతంగా అభివృద్ధి చెందుతుందని, యువతకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని అన్నారు. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ గూడూరు భాస్కర్‌రెడ్డి, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు హన్మనాయక్, మాజీ ఎంపీటీసీ గురిగళ్ల లక్ష్మయ్య, పీఏసీఎస్ డైరెక్టర్ చేగూరి వెంకటేశ్, కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు మాలె మల్లేశ్‌గౌడ్‌లు మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం, గ్రామాల అభివృద్ధి సాధ్యమన్నారు. అవకాశ వాదులు, ప్రగతి నిరోధకులకు ప్రజలు పంచాయతీ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలన్నారు. రాయికంటి భిక్షపతికి మద్దతుగా ఆయన భార్య జయసుధ, కుటుంబసభ్యులు సుగుణమ్మ, సంధ్య, గీత, పింకీ, స్వాతి, మంజుల ఇంటింటి ప్రచారం చేపట్టారు. ప్రచారంలో నాయకులు జహంగీర్‌అలీ, రాంచందర్ నాయక్, జహంగీర్‌బాబా, సత్యంయాదవ్, చందోజీ, రాజేశ్, రవి, ఇమ్రాన్‌బాబా, శ్రీకాంత్, మంకి శ్రీను, యాదగిరిరెడ్డి, భిక్షపతి, రమేశ్, రవి, తదితరులు ఉన్నారు.



గూడూరు శ్రీనివాస్‌రెడ్డితో కలిసి ప్రచారం చేస్తున్న రాయికంటి భిక్షపతి

మొగిలిగిద్ద గ్రామ రూపురేఖలు మారుస్తా



ప్రచారం నిర్వహిస్తున్న బుగ్గ కృష్ణ

షాద్‌నగర్ రూరల్, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామస్తుల సహకారంతో మొగిలిగిద్ద గ్రామ రూపురేఖలు మారుస్తానని బీఆర్ఎస్ మద్దతుతో పోటీ చేస్తున్న బుగ్గ కృష్ణ తెలిపారు. ఆదివారం గ్రామంలో పెద్ద ఎత్తున ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాభివృద్ధిలో పెద్దల సలహాలు, సూచనలు తీసుకుని ముందుకుపోతానని చెప్పారు. చారిత్రాత్మకమైన మొగిలిగిద్ద ఇప్పటికీ అభివృద్ధిలో వెనుకబడి ఉందన్నారు. బుగ్గ పోచయ్య వారసుడిగా తనకు అవకాశం ఇవ్వాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను గ్రామాన్ని అభివృద్ధి చేయడానికి పూర్తి ప్రణాళిక రూపొందించుకున్నానని, అందరినీ కలుపుకుపోతానన్నారు. పాఠశాలల అభివృద్ధికి కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకం ఉంచి పర్పంచ్‌గా గెలిపించాలని కోరారు. ప్రచారంలో మహిళలు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. మహిళలు ఆట, పాటలతో జోరుగా ప్రచారం నిర్వహించారు. అందరివాడిగా గుర్తించి సర్పంచ్‌గా గెలిపించాలని కోరారు.



ప్రచారంలో భాగంగా మహిళల ఆటా పాట

ఉరేసుకొని వ్యక్తి ఆత్మహత్య

చేవెళ్ల, డిసెంబరు 7 (ఆంధ్రజ్యోతి) : మానసికస్థితి బాగాలేక ఓ వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చేవెళ్ల పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఆలూరు గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై శిరిష కథనం ప్రకారం.. ఆలూరుకు చెందిన చనిగళ్ల రవిబాబు(42) కొన్ని రోజులుగా ఆరోగ్యం బాగాలేక పిచ్చిగా ప్రవర్తించడంతో కుటుంబ సభ్యులు పలుమార్లు ఆసుపత్రికి తీసుకెళ్లి చూపించినా బాగుకాలేదు. భార్య రేణుక చేవెళ్ల పట్టణ కేంద్రంలోని కోపరేటివ్ బ్యాంక్‌లో అటెండర్‌గా పనిచేస్తుంది. రోజు మాదిరిగానే ఈనెల 6న బ్యాంకు వెళ్లింది. ఇంటి వద్ద ఉన్న రవిబాబు తాడుతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సాయంత్రం రేణుక ఇంటికి రాగా.. తలుపులు వేసి ఉన్నాయి. కిటికీలోంచి చూడగా సీలింగ్ ఫ్యాన్‌కు ఉరేసుకున్న భర్తను గమనించి పోలీస్‌లకు సమాచారం అందించడంతో వచ్చి పరిశీలించారు. మానసికస్థితి బాగాలేకనే ఉరేసుకొని ఉండొచ్చని పోలీస్‌లు అనుమానిస్తున్నారు. కాగా, మృతుడి కుటుంబ సభ్యులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీస్‌లు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

ముగిసిన వేంకటేశ్వర స్వామి బ్రహ్మోత్సవాలు

తలకొండపల్లి, డిసెంబరు 7(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని రాంపూర్ శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు ఆదివారం వైభవంగా ముగిశాయి. వారం రోజులపాటు బ్రహ్మోత్సవాలు కన్నుల పండువగా కొనసాగాయి. బ్రహ్మోత్సవాల నేపథ్యంలో ఆలయ చైర్మన్ జిల్లెల్ల పవన్‌కుమార్ రెడ్డి, ఈవో స్నేహలతల ఆధ్వర్యంలో భక్తులకు వసతులు ఏర్పాటు చేశారు. ముగింపు వేడుకల్లో నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లు రవి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

అవకాశం ఇవ్వండి.. సేవకుడిగా పనిచేస్తా

ఎల్కగూడ సర్పంచ్ అభ్యర్థి చాకలి బందయ్య



ఎల్కగూడలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న స్వతంత్ర అభ్యర్థి చాకలి బందయ్య

చౌదరిగూడ, డిసెంబర్ 7(ఆంధ్రజ్యోతి): ఎల్కగూడ గ్రామాభివృద్ధికి, ప్రజల మేలుకోసం నిరంతరం సేవకుడిగా పనిచేస్తానని, సర్పంచ్‌గా కత్తెర గుర్తుకు ఓటువేసి తనను గెలిపించాలని స్వతంత్ర అభ్యర్థి చాకలి బందయ్య ఓటర్లను అభ్యర్థించారు. ఆదివారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని ఎల్కగూడ పంచాయతీ బోయగూడ, లక్ష్మీదేవిపల్లి గ్రామాల్లో ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. సర్పంచ్‌గా గెలిపిస్తే గ్రామంలో నెలకొన్న సమస్యల పరిష్కారిస్తానని హామీ ఇచ్చారు. గ్రామంలోని పలు వార్డుల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ తిరిగి కత్తెర గుర్తుకు ఓటేసి గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. తాను గెలిచిన వెంటనే గ్రామంలోని అన్ని వార్డుల్లో విద్యుత్ లైట్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ, తాగునీటి సౌకర్యం, సీసీరోడ్ల నిర్మాణానికి పెద్దపీట వేస్తానని హామీ ఇస్తున్నారు. గ్రామంలో తాగునీటి సౌకర్యంకోసం వాటర్ ఫిల్టర్ ఏర్పాటుకు హామీ ఇచ్చారు. జనమే తనకు కొండంత బలమని ఆయన అన్నారు. ఎవరు ప్రజలకు అందుబాటులో ఉంటారో ఓటర్లు గ్రహించి నిర్ణయం తీసుకోవాలన్నారు. తనకు అన్నివర్గాల ఓటర్లు మద్దతు లభిస్తుందని ఆయన అన్నారు.



ఎల్కగూడలో ప్రచారం చేస్తున్న చాకలి బందయ్య